క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో పూర్వవిద్యార్థి, కవయిత్రి మెహజబీన్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా పూర్వవిద్యార్థులు గురువారం ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ గిరి,అధ్యాపకులు కుసుమకుమారి, భారతి, పూర్వ విద్యార్థుల సంఘ కన్వీనర్ కరుణశ్రీ, సభ్యులు రంజని, మమత, అపర్ణాదేవి, లక్ష్మి, స్వాతి, రుక్మిణి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు (వేదాయపాళెం) : డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని బాలాజీనగర్ సెంటర్లో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డీవైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ కాలేషాబాషా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీపీ నరసింహ, ఎంవీ రమణ పాల్గొన్నారు.

రత్నం విద్యార్థికి అభినందన



నెల్లూరు (టౌన్): రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు రత్నం స్కూల్ విద్యార్థి సాయి ఆదర్శ ప్రదర్శించిన ట్రెడిషనల్ బయోలాజికల్ స్ట్రేటజీస్ ప్రాజెక్టు ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగా భవాని రత్నం విద్యార్థి సాయి ఆదర్శను గురువారం అభినందించారు. అనంతరం స్కూల్ డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతికిషోర్ ప్రాజెక్టు ప్రదర్శించిన విద్యార్థులు సాయిఆదర్శ, ధన్విత, సుహాస్, గైడ్‌టీచర్ జరీనాను అభినందించారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ ప్రపూర్ణ పాల్గొన్నారు.

డీసీసీబీలో సంబరాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గాంధీ బొమ్మసెంటర్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో గురువారం సంబరాలు నిర్వహించారు. డీసీసీబీ రూ.2వేల కోట్ల వ్యాపార లావాదేవీల లక్ష్యాన్ని అధిగమించడంతో పాటు సహకార సమైఖ్య పథకంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో డీసీసీబీ సీఈఓ సరిత ఛాంబర్‌లో కేక్ కట్ చేశారు. డీజీఎంలు, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లాటరీ

నెల్లూరు రూరల్: నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు గురువారం లాటరీ నిర్వహించారు. లైసెన్స్‌లు కలిగిన పలువురు వ్యాపారులకు వీఆర్సీ, వైఎంసీఏ ,ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్ మైదానాల్లో దుకాణాలు కేటాయించారు. కాగా అర్హత ఉన్న తమకు షాపులు కేటాయించలేదని పలువురు వ్యాపారులు ఆరోపించారు.

జాతీయ హాకీ పోటీలకు కేఎన్నార్ విద్యార్థి

నెల్లూరు (టౌన్): జాతీయ హాకీ పోటీలకు కేఎన్నార్ మున్సిపల్ స్కూల్ విద్యార్థి సాయి భువన్ ఎంపికైనట్లు ఆ స్కూల్ హెచ్‌ఎం విజయప్రకాష్ తెలిపారు. గురువారం బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్‌లో సాయిభువన్‌ను హెచ్‌ఎం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో ఈనెల 3,4,5 తేదిల్లో రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఈటీ గాయత్రి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

- నగర ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్‌కుమార్



కార్తీక మాసోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్పొరేషన్, విద్యుత్, తదితర శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ దేవస్థానానికి కార్తీక మాసంలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. వీధుల్లో ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. మూలాపేట ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. మూలస్థానేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. తొలుత కార్తీక మాసోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు.

రెండో ఓటేస్తే గుర్తుపట్టలేని ముఖం నాది కాదు

తనకు మూడు ఓట్లు ఉన్నాయని, సీపీఐ నేత రామకృష్ణతో పాటు మరికొందరు టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని, ఎవరైనా రెండు ఓట్లు వేస్తే వారిని గుర్తుపట్టకపోవచ్చేమో గానీ, రెండు ఓట్లు వేస్తే గుర్తుపట్టలేని ఫేస్ తనది కాదని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. 2019 ఎన్నికలకు ముందుకు తన పేరుపై రెండు ఓట్లు ఉంటే తన ఇంటి అడ్రసులో ఉన్న ఓటు తప్పితే తనకు సంబంధంలేని మిగిలిన ఓటును తొలగించాలని డిక్లరేషన్ తీసుకున్నానని గుర్తుచేశారు. అలాగే 2024 ఎన్నికలకు ముందు కూడా తన ఇంటి అడ్రసుతో ఉన్న ఒక్క ఓటు మినహా మిగిలిన ఓట్లను తొలగించాలని డిక్లరేషన్ తీసుకుంటామని తెలిపారు. నారాయణ దోపిడీలు, ఆయన మరదలి ఆర్తనాదాలను సోషల్ మీడియాలో పెట్టకుండా తన పేరు మీద తనకు తెలియని, సంబంధం లేని ఓట్ల పోస్టులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. నగర నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు రమ్మంటే నారాయణ రానని చెబుతుండడం చూస్తే ఏ మాత్రం అభివృద్ధి చేశారో అర్థమవుతుందన్నారు. నగర నియోజకవర్గంలోని కనీసం పది మంది టీడీపీ కార్యకర్తల పేర్లు అయినా తెలుసా? అని నారాయణను ప్రశ్నిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, నెల్లూరు ఆర్డీఓ మలోల, నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మానికల సునీల్, మల్లి నిర్మల, నూనె ప్రసాద్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకొందాం



కార్మికుడికి యూనిఫామ్, సామగ్రి కిట్ అందజేస్తున్న మేయర్, కమిషనర్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో పర్యావర అనుకూలమైన ఉత్పత్తులతో కాలుష్య రహిత దీపావళిని జరుపుకొని క్లీన్ అండ్ గ్రీన్ ప్రచారంలో ఆదర్శంగా నిలుద్దామని మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్ పిలుపునిచ్చారు. దీపావళిని పురస్కరించుకుని కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్, గుర్తింపు కార్డులతో పాటు చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు, చీరలు, తదితర సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు పర్యావరణానికి హాని చేసే బాణసంచా ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించి కాలుష్య నివారణకు దోహదపడాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికులకు ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారాలు పొందాలని సూచించారు. విధి నిర్వహణలో కార్మికులు క్రమశిక్షణను పాటించాలని, పనిప్రదేశాల్లో రక్షణ ఉపకరణాలను వినియోగించాలని ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు కార్మికులంతా కృషి చేయాలన్నారు. అనంతరం కార్మికులతో 'కాలుష్య రహిత దీపావళి' ప్రతిజ్ఞ చేయించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, ఎంహెచ్ఓ వెంకటరమణ, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, టీపీఆర్ఓ ప్రసాద్, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇంజినీరింగ్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్, ఆడియోలజిస్ట్ కమ్ స్పీచ్ థెరిపిస్ట్, డెంటల్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఏ ఎం పెంచలయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ""sorneore.ap.g-ov.i n/no-ti-ce/r-ecruit-ment" వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 14వ తేదీలోగా జీజీహెచ్‌లో అందజేయాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

నెల్లూరు సిటీ: నారాయణ మెడికల్ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వాణి పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ పీ శ్రీనివాసులురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ఆర్ విశ్వకుమార్, అకాడమిక్ డైరెక్టర్ నరసింహరెడ్డి, మేనేజర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా బాక్సింగ్ జట్టు ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విశాఖపట్నంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఎలైట్ మెన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు ఎంపికను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం నిర్వహించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణారెడ్డి నేతృత్వంలోఎస్‌కే అర్షాద్, అశోక్, పీ ఫాజిల్, ఆర్ అజయ్‌ను ఎంపిక చేశారు.

హాకీ క్రీడాకారుడికి అభినందన

నెల్లూరు(బారకాసు): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన హాకీ క్రీడాకారుడు కొత్తకోట భానుప్రకాష్ ఎంపికయ్యారు. కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌కు కమిషనర్ అభినందనలు తెలిపారు. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన నగదు ప్రోత్సాహకాలను కార్పొరేషన్ తరఫున అందజేస్తామని పేర్కొన్నారు.

17 నుంచి అయ్యప్ప స్వామి మండల పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి మందిరంలో స్వామి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో ఈ 17 నుంచి డిసెంబరు 27 వతేదీ వరకు 37వ వార్షిక మండల పూజోత్సవాలను కేరళ సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ సేవా సమాజం పాలకమండలి అధ్యక్షుడు గూడల శేషగిరిరావు తెలిపారు. అయ్యప్పస్వామి మందిరంలో మండల పూజోత్సవాల ఆహ్వానపత్రికలను గురువారం ఆవిష్కరించారు. కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఈ నెల 16న రాత్రి 7గంటలకు ధ్వజారోహణ, అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం దాతలు గడ్డం రత్నయ్య, సుజాత దంపతుల సహకారంతో అయ్యప్ప భక్తుల కోసం ఆధునిక సౌకర్యాలతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన 14 స్నానాలగదులను ప్రారంభించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



కొండ్లపూడిలో...



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు రూరల్: కొండ్లపూడిలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూరల్ మండలంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడంతో పాటు అభివృద్ధి జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ రూరల్ మండల కన్వీనర్ రాంప్రసాద్‌రెడ్డి, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్, పాత గిరిజనకాలనీ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నేత సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, బ్రహ్మానందపురం ప్రాంతంలోని 36/1 సచివాలయంలో స్థానిక కార్పొరేటర్ పిండి శాంతిశ్రీ ఆధ్వర్యంలో 'ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ డివిజన్ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కార్యదర్శులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బాడీబిల్డర్‌కు వీపీఆర్ ఫౌండేషన్ ప్రోత్సాహకం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరుకు చెందిన బాడీ బిల్డర్ పఠాన్ షబ్బీర్‌ఖాన్‌కు వీపీఆర్ ఫౌండేషన్ రూ.2.5 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. నెల్లూరులోని జెండా వీధికి చెందిన పఠాన్ షబ్బీర్‌ఖాన్ బాడీ బిల్డర్‌గా రాణిస్తున్నారు. ఈ నెల 17, 18, 19వ తేదీల్లో ముంబైలో జరగనున్న నేషనల్ ఓపెన్ మెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార సదస్సులో వీపీఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ చేతుల మీదుగా షబ్బీర్‌ఖాన్‌కు రూ.2.5 లక్షల చెక్కును అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

నెల్లూరు (దర్గామిట్ట): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతమైందని కలెక్టర్ ఎం హరినారాయణన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో మాట్లాడారు. జిల్లాలో 663 ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించగా, 2,44,866 మంది వైద్యసేవలు పొందారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు విజయవంతం చేసిన వైద్యులు, వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, మండలాధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.









